రైజ్ నిర్మాణ సంస్థపై విచారణ జరిపించాలి

నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణారావుకు ఫిర్యాదు



నిజాంపేట్: బాచుపల్లిలోని రైజ్ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లు పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించే నిర్మిస్తుందా? లేదా? అనే అంశాలను అధికారులు పరిశీలించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రైజ్ నిర్మాణ సంస్థ బిల్డర్లు మొదటి నుంచి నిబంధలను అతిక్రమిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతులకు కోసం సర్వే నం.486 రేణుక ఎల్లమ్మ కాలనీలోని 30 ఫీట్ల రోడ్డు చూపించారని... అదే విధంగా ప్లాట్ నం.114, 115లను ఆక్రమించుకుని తన వెంచర్‌లో విలీనం చేసుకున్నరనే ఫిర్యాదులు ఉన్నాయి.

◆ హెచ్‌ఎండీఏ నిబంధనల మేరకు నిర్మాణం సైతం జరగడం లేదని స్థానిక రేణుకా ఎల్లమ్మ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పలు మార్లు జిల్లా కలెక్టర్, హెచ్‌ఎండీఏ కమిషనర్, ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ ఇప్పటికైనా రైజ్ నిర్మాణ సంస్థపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గురువారం శ్రీనిధి ఓక్‌ల్యాండ్ గేటెడ్ కమ్యూనిటీ నివాసులు సైతం తమ నివాసులకు రైజ్ రిటైనింగ్ వాల్ మూలంగా ప్రమాదం పొంచి ఉందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు.

చినుకు పడితే వణుకే.!


ఉషోదయకు వెళ్లే దారిలో డీసీఎంపై విరిగి పడిన చెట్టు.. పక్కనే విరిగిన విద్యుత్ స్తంభం

కుత్బుల్లాపూర్: చిన్న వర్షం పడితేనే కరెంటు పోవడం.. డ్రైనేజీలు పొంగిపొర్లడం.. ఈదురు గాలులకు చెట్లు విరిగిపోవడం వంటి జరుగుతాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇలాంటివే జరిగాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలకు ఏర్పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా సుమారు 5గంటల సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం.. మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం వరకు ఆ సరఫరా పునరుద్ధరణ కాలేదు.

- ప్రతిరోజు మరమ్మతుల పేరిట విద్యుత్ అధికారులు చేసే హడావిడి ఒక ఎత్తు అయితే ఇలా చిన్నపాటి వర్షం, ఈదురు గాలులు వస్తే సేమ్ సీన్ రిపీట్ కావడం అధికారుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. దీంతో ప్రతిసారి వర్షం పడ్డ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం జరుగుతూ వస్తోంది. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు? అనేది అధికారులే సమాధానం చెప్పాలి. అదేవిధంగా జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతూ కనిపించాయి.
- సుభాష్‌నగర్ ప్రాంతంలో రాత్రి కురిసిన వర్షం వల్ల పలు గల్లీల్లో మురుగు పొంగిపొర్లుతూ కనిపించాయి. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.
- జీడిమెట్ల పారిశ్రామికవాడ ఉషోదయ టవర్స్‌కు వెళ్లే మార్గంలో డీసీఎం వాహనంపై చెట్టు కూలగా ఇదే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం సైతం పడిపోయింది. ఆ సమయంలో వాహనంలో ఎవరూ లేకపోవడం మూలంగా పెను ప్రమాదం తప్పినట్లు అయ్యింది.
- వర్షం పడితే చాలు సందట్లో.. సడే మియా అన్నట్లుగా పలు కెమికల్ కంపెనీ నిర్వాహకులు నాలాల్లో కలుషిత రసాయనాలు వదిలి చేతులు దులుపుకున్నారు. సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రతి నెల మామూళ్లకు అలవాటు పడడంతో నిత్యం ఇక్కడ వర్షం పడ్డ సమయంలో ఇలా పరిపాటిగా వదలడం జరుగుతూ వస్తుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.
- అయోధ్యనగర్ దిగువ ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు ఈ కాలనీని పూర్తిగా జలమయం చేస్తున్నాయి. వర్షం పడ్డ ప్రతిసారి ఇళ్లలోకి నీళ్లు రావడం పరిపాటిగా మారింది. అధికారులు గతంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు పేర్కొన్నారు.


ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

- చింతల్ ప్రధాన రహదారి వెంట మధ్యలో నిర్మాణం చేపట్టడంతో వర్షం పడ్డ ప్రతిసారి షా థియేటర్ వద్ద వర్షపు నీరు నిలవడంతో బాలానగర్ నుంచి చింతల్ వైపువచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రత్యామ్యంగా ఏర్పాట్లు చేయాలని గతంలో కోరినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.
- గాజులరామారం సర్కిల్ పరిధిలో పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నాలా పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకోవడంతో వర్షం పడ్డ ప్రతిసారి కాలనీలు జలమయం అవుతున్నాయి. అయితే విశేషం ఏమిటంటే ఇక్కడ నిర్మాణాలకు గ్రేటర్ అధికారులే అనుమతి ఇవ్వడం విశేషం.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య ఓ ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అడ్మిషన్లు పొందేందుకు బహదూర్‌పల్లి క్రాస్ రోడ్డులోని కళాశాలలో సంప్రదించాలన్నారు. తమ వెంట టెన్త్ పాస్ మెమో జిరాక్స్ కాపీ, టెన్త్ ఒరిజినల్ టీసీ, బోనోఫైడ్, ఆధార్ జిరాక్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను దరఖాస్తుతో సమర్పించాలన్నారు. జూనియర్ ఇంటర్‌కు జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

సమ్మర్ ఉత్సవ్ మేళా

ప్రవేశం ఉచితం: మేనేజర్ డేవిడ్

కుత్బుల్లాపూర్: వేసవిలో నగర వాసులను అలరించేందుకు సమ్మర్ ఉత్సవ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఎం.డేవిడ్ ఓ ప్రకటనలో తెలిపారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలోని హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ మేళాలో అవతార్ సినిమాలోని వివిధ పాత్రలలో కనిపించే ఏలియన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌లో 15 రకాల వివిధ రైడ్స్, ఎమ్యూజ్మెంట్ రైట్స్, షాపింగ్ మాల్స్‌తో పాటు ఏలియన్స్ విన్యాసాలను సమ్మర్ ఉత్సవ్ మేళాలో నేరుగా చూసి అనుభూతి పొందవచ్చన్నారు. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు సందర్శకులకు ఉచితంగా సమ్మర్ ఉత్సవ్ మేళా ప్రవేశం ఉంటుందన్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

సుభాష్‌నగర్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సుందర్‌నగర్‌కు చెందిన మహేష్(27) గురువారం తన బంధువు వర్మతో కలిసి సూరారం 60 గజాల్లో శేఖర్ అనే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న భవన నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లాడు. భవనం మొదటి అంతస్తులో శ్లాబ్‌ను కవర్‌తో కప్పేందుకు యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హైటెన్షన్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భవన యజమాని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య రోషిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో పనులు చేయిస్తున్న వ్యక్తులపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: పిల్లలతో పనులు చేయిస్తున్న వ్యక్తులపై బాల రక్షక్ భవన్ అధికారులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సాయిబాబానగర్‌లో ఆల్మాస్ బేకరీలో విజయ్‌కుమార్(15) అనే బాలుడితో పనులు చేయిస్తుండగా స్మైల్ టీమ్ గుర్తించింది. అదేవిధంగా సూరారం పాండుబస్తీలోని లేజర్ షేవింగ్ ప్రొడక్ట్స్ కంపెనీలోని పని చేస్తున్న రామ్‌చరణ్(16), బీబాస్‌మాలిక్(16)లు పని చేస్తుండగా స్మైల్ టీమ్ సభ్యులు వారిని అక్కడ ఉండి ఇంటికి పంపించారు. బేకరీ యజమాని భగవంత్, పరిశ్రమ యజమాని రవీందర్‌లపై చర్యలు తీసుకోవాలని బాలరక్షక్ భవన్ మేనేజర్ అరుణ్ జంజాల్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల తర్వాత హామీలన్నీ నెరవేరుస్తాం

కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి


ప్రచారంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను తెలంగాణ ప్రజలను తిరస్కరించారని.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బాచుపల్లి, రాజీవ్‌గాంధీనగర్, మల్లంపేట్, బౌరంపేట్, దుండిగల్, గాగిల్లాపూర్, బహదూర్ పల్లి, దూలపల్లి కొంపల్లి ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి ప్రాంతంపై ఎంతో మక్కువ ఉందన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలోపే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి విశేష స్పందన లభించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోత్స్నారెడ్డి, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణతో ఆత్మస్థైర్యం



కుత్బుల్లాపూర్: మహిళల ఆత్మరక్షణకు కరాటేలో ఎంతో ఉపయోగపడే టెక్నిక్స్ ఉన్నాయని భూమ్స్ అకాడమీ నిర్వాహకుడు మాస్టర్ కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలో సమ్మర్ క్యాంపులో భాగంగా నిర్వహించిన శిక్షణ శిబిరానికి పెద్ద ఎత్తున మహిళలు రావడంతో వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే కరాటేలో శిక్షణ తీసుకుంటే రాబోయే రోజుల్లో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతారన్నారు. స్కేటింగ్, కరాటేలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. నామమాత్రపు ఫీజుతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి శిక్షణ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వారికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి తాను కూడా వారికి కరాటే విద్యలో పలు మెలకువలు నేర్పిస్తున్నానని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే వివేకానంద్ టైగర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్


దుండిగల్ కమాన్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుత్బుల్లాపూర్ పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. బుధవారం రాత్రి దుండిగల్ కమాన్ వద్ద కేసీఆర్ రోడ్‌షో నిర్వహించిన విషయం తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్‌లో సమావేశం లేనప్పటికీ ఒక రోజు ముందే ఇక్కడ రోడ్‌షో ఏర్పాటు చేశారు. సమావేశాన్ని విజయవంతం చేయడంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సఫలీకృతమయ్యారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తు కేసీఆర్ తన ప్రసంగంలో వివేకానంద్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ టైగర్ అని కొనియాడారు. రాష్ట్రంలోనే 85 వేలకు పైగా మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించారని సభలో కోరారు. కేసీఆర్ వివేకానంద్‌ను ప్రశంసిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు నినాదాలు చేస్తు హోరెత్తించారు.

స్పిరిట్ దందా గుట్టురట్టు



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు. స్పిరిట్‌ను పరిశీలిస్తూ...

సుభాష్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా స్పిరిట్ దందా కొనసాగిస్తున్న అధికారులు కొరడా ఝుళిపించారు. కొంపల్లి మున్సిపల్ పరిధి దూలపల్లిలోని ఫాక్స్‌సాగర్‌కు ఆనుకొని ప్లాట్ నెంబర్ 125 గోదాంలో జగదాంబ కెమికల్స్ అనే కంపెనీపై రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ నేతృత్వంలో ప్రొహిబిషన్–ఎక్సైజ్ శాఖ రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం దాడులు చేసి 150 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 21 వేల లీటర్ల రెక్టిఫైట్ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దశరథ వివరాలు వెల్లడించారు. బుధవారం దూలపల్లి ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న స్పిరిట్‌ను పట్టుకొని ప్రశ్నించగా సదరు వ్యక్తి ద్వారా దూలపల్లిలో గోదాం పరిశీలించగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ దందా కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. యజమాని హనుమాన్ రామ్‌సేన్ తో పాటు అతని సహాయకుడు శ్రావణ్ కుమార్‌ను అరెస్ట్ చేశామని స్పిరిట్ విలువ దాదాపు రూ.2.30 కోట్లకు పైగా ఉంటుందన్నారు. విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, ఎక్సైజ్ సూపరిడెంట్ మేడ్చల్ షేక్ ఫయాజ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రంగారెడ్డి జిల్లా జే. జీవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీదే..


దుండిగల్: ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని... ఆదివాసీ గిరిజన తెగల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ తాండాలో జరిగిన బంజారాల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... గిరిజనల సంక్షేమం కోసం తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, శ్యామ్‌రావు, ఎన్నికల పరిశీలకులు చంద్రశేఖర్, చల్లా నారాయణ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కిషన్‌నాయక్, విజయ్‌నాయక్, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత ఎస్.మల్లారెడ్డి

బీజేపీ ప్రభుత్వంతోనే దేశ ప్రజలకు రక్షణ

మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


ఎం.ఎస్.వాసు ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

జీడిమెట్ల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందని మల్కాజిగిరి లోక్‌సభ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు రాష్ట్ర మాజీ బీజేపీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. వై.గిరిబాబు, భద్రయ్య, వెంకటరెడ్డి, బుజ్జిబాబు, శివన్నారాయణ, వికాస్, శ్రీను, బాల, రాము, చంద్రశేర్, టీఎస్‌ఐఐసీ కాలనీ నుంచి గద్దం శ్రీనివాసరాజు, చిన్నా మరియు రవిందర్ యాదవ్, నాయుడు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం, రక్షణ, భద్రత కోరుకునే నాయకులు బీజేపీలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరాజు, చోడకం చంద్రశేఖర్, విజయ్, అల్లూరి విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు జి.సత్తిబాబు, సీహెచ్ నాగరాజు, ఎ.నరసింహ, చిన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

కుత్బుల్లాపూర్: తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని భూమిరెడ్డి కాలనీ, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, పలు అపార్ట్‌మెంట్ వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ హ్యాట్రిక్ విజయం సాధిస్తారన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.మల్లారెడ్డి, చెరుకుపల్లి భరతసింహారెడ్డి, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


బీజేవైఎం అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న మల్లారెడ్డి, చంద్రశేఖర్

భారత్‌ను విశ్వగురువుగా నిలబెట్టేందుకు మోదీ కృషి

కుత్బుల్లాపూర్: భారత్‌ను విశ్వగురువుగా నిలబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నేత డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బీజేవైఎం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ ఒక్కంటి దయాకర్ ఆధ్వర్యంలో గురువారం యువమోర్చా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ... బీజేవైఎం నాయకులు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బూత్ స్థాయి నుంచి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అదే విధంగా పోల్ మేనేజ్‌మెంట్‌లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన కల్పించారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, అసెంబ్లీ ప్రబారి జగన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, బావిగడ్డ రవి, బీజేవైఎం జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.